ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శుక్రవారం 18 జూలై 2025



ఉద్యాన సాగుకు ఊతం



- ఉపాధి హామీ ద్వారా 18 రకాల పండ్లతోటల పెంపకం
- రైతులు రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

6లో

- ఖాళీగా ఏటీడబ్ల్యూవో పోస్టులు
- తప్పని పాలనాపరమైన ఇబ్బందులు
- పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో వార్డెన్ల కొరత
- పట్టించుకోని అధికారులు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు

గిరిజన విద్యాలయాలపై పర్యవేక్షణ ఏదీ?



వైరల్ జ్వరాలతో కుసిమి పీహెచ్‌సీకి వచ్చిన గిరిజన విద్యార్థులు

సీతంపేట రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, పోస్టుమెట్రిక్ వసతిగృహాలపై పర్యవేక్షణ కొరవడుతోంది. సహాయ గిరిజన సంక్షేమాధికారులు (ఏటీడబ్ల్యూవో), వార్డెన్లు పూర్తిస్థాయిలో లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలు, మెనూ అమలు, డైట్, బిల్లులు సరిచూసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం, సర్వీస్ క్రమబద్ధీకరణ, ట్రెజరీకి బిల్లులు పంపించడం, నకిలీ ధ్రువపత్రాలపై విచారణ, విద్యార్థుల ఫేస్ రికగ్నేషన్ (ఎఫ్ఆర్ఎస్)అమలు వంటి కీలకమైన బాధ్యతలను ఏటీడబ్ల్యూవోలు నిర్వహించాల్సి ఉంది. కానీ, సీతంపేట ఐటీడీఏ పరిధిలో రెండు చోట్ల ఈ పోస్టులు ఖాళీగా ఉండడంతో పాలనపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అదే విధంగా 18 పోస్టుమెట్రిక్ వసతి గృహాలకు గాను పది మంది వార్డెన్లు మాత్రమే ఉన్నారు. దీంతో సమస్యలు తప్పడం లేదు.



బుడగరాయి ఆశ్రమ పాఠశాలలో తోటి విద్యార్థులకు మజ్జిగ వడ్డిస్తున్న విద్యార్థి



సీతంపేట ఐటీడీఏ పరిధిలోని ఏపీఆర్ మల్లి బాలుర గురుకుల పాఠశాల

ఇదీ పరిస్థితి..

ఉమ్మడి జిల్లాలోని సీతంపేట ఐటీడీఏ పరిధిలో 47 ఆశ్రమ పాఠశాలలు, 18 పోస్టుమెట్రిక్ వసతిగృహాలు, 12 గురుకులాల పరిధిలో సుమారు 16వేల మంది గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. అయితే, సీతంపేట, మెళియాపుట్టి ఏటీడబ్ల్యూవోల పోస్టులు గత కొన్ని రోజులుగా ఖాళీగా ఉన్నాయి. సీతంపేట ఏటీడబ్ల్యూవోగా పనిచేసిన జి.మంగవేణి ఇటీవలే అనకాపల్లి డీఎస్‌టీబ్ల్యూ అండ్ ఈవోగా బదిలీపై వెళ్లిపోయారు. దీంతో ఈ బాధ్యతలను డీడీ అన్నదొర నిర్వహిస్తున్నారు. అలాగే, మెళియాపుట్టి ఏటీడబ్ల్యూవోగా పనిచేసిన కృష్ణవేణి కూడా కొద్ది రోజుల కిందట పార్వతీపురం డీడీగా డెప్యుటేషన్‌పై వెళ్లారు. ఇటీవల నిర్వహించిన బదిలీల్లో ఆమె సాలూరుకు బదిలీ అయ్యారు. మెళియాపుట్టి రెగ్యులర్ ఏటీడబ్ల్యూవో పోస్టు ఖాళీగా ఉండడంతో లాబర ఆశ్రమ పాఠశాల

(మిగతా 8వ పేజీలో..)

ప్రభుత్వానికి నివేదించాం

సీతంపేట, మెళియాపుట్టి ఏటీడబ్ల్యూవో పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వానికి నివేదించాం. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పాఠశాలలపై పర్యవేక్షణ ఉంచాం. పోస్టుమెట్రిక్ వసతిగృహాల్లో రెగ్యులర్ వార్డెన్ల నియామకం కోసం ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక పంపాం. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

-అన్నదొర, గిరిజనసంక్షేమ ఉపసంచాలకులు

జిల్లాలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు

- జిల్లా వ్యాప్తంగా పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాం
- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పీ-4 ఫౌండేషన్, ప్రజా స్పందన, స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర, ఎంఎస్ఎస్ఈ పార్కులు, ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్లకు మార్గదర్శకాలను జారీ చేశారు. ప్రతినెల మూడో శనివారం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ప్లాస్టిక్ రహిత జిల్లాలుగా తీర్చిదిద్దేందుకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ జిల్లా ప్లాస్టిక్ రహితమని డిజిటల్ క్యాంపెయిన్ చేపట్టాలన్నారు. వీధి నాటకాల ద్వారా కూడా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ.. మన్యం జిల్లాలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సీఎస్‌కు వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే పారిశుధ్య పక్షోత్సవాలు ప్రారంభమయ్యాయని, ఈ నెల 30 వరకు కొనసాగనున్నాయని చెప్పారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జేసీ శోభిక

మురుగు కాలువల్లో పూడికలు తీయించడం, రక్షిత మంచినీటి ట్యాంక్‌లను శుభ్రం చేయించడం, నీటిపరీక్షలు చేపట్టడం వంటివి చేస్తున్నామని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ శోభిక, జిల్లా రెవెన్యూ అధికారి హేమలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను అమలు చేయాలి

- ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు



6లో

ఆదరించి ఆశీర్వాదం ఇవ్వండి

- సినీనటుడు నారాయణమూర్తి



6లో

ఆత్మ విశ్వాసంతో సేవలందించాలి

- జిల్లా విద్యాశాఖాధికారి రాజశేఖర్

సీతానగరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ పొందిన విద్యార్థులు విపత్తులు వచ్చిన సమయంలో ఆత్మ విశ్వాసంతో సేవలందించాలని జిల్లా విద్యాశాఖాధికారి రాజశేఖర్ అన్నారు. జోగింపేట అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు కోర్సు డైరెక్టర్ నారాయణమూర్తిస్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ తరగతుల్లో గురువారం డీఈవో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు విపత్తులను ఎదుర్కొనేందుకు అవసరమైన స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ పొందాల్సిన అవ సరం ఉందన్నారు. అగ్ని, రోడ్డు ప్రమాదాలు, పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలు వంటి విప త్కర పరిస్థితుల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమం లో ఏఎస్‌వోలు చిన్నం నాయుడు, విజయ్‌కుమార్, రజియా బేగం, నరసింహ స్వామి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో రాజశేఖర్

ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

- కృత్రిమ కొరత సృష్టించినా కూడా.. ● హెచ్చరించిన విజిలెన్స్ అధికారులు
- నాలుగు మండలాల్లో ఎరువుల దుకాణాల తనిఖీ

పాలకొండ/భామిని/వీరఘట్టం/ సీతంపేటరూరల్, జూలై17 (ఆంధ్రజ్యోతి): ఎరువులను అధిక ధరలకు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరించారు. గురువారం భామిని, పాలకొండ, వీరఘట్టం, సీతంపేట మండలాల్లోని వివిధ ఎరువుల దుకాణా లను తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లు, నిల్వలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎరువులు విక్రయిం చాలన్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే షాప్‌లు సీజ్ చేస్తామని హెచ్చరించారు. విజిలెన్స్ సీఐ పి.రమణయ్య పాలకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు రత్నకుమారి, రాజాం వెల్ఫేర్ అధికారి చంద్రశేఖర్, వ్యవసాయాధికారులు తిలక్, రవీంద్ర, జె.సౌజన్య, ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.



భామిని మండలం సింగిడిలో ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

గిరిజనుల అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

- రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ భార్గవి
- జీవో నెంబర్-3పై అభిప్రాయ సేకరణ

పార్వతీపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ ఎస్.సదాభార్గవి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జీవో నెంబర్-3పై గిరిజన అభిప్రాయాలను తెలుసుకునేందుకు గురువారం పార్వతీపురం ఐటీడీఏలోని గిరిమిత్ర సమావేశ మందిరంలో గిరిజన సంఘాలు, గిరిజన ఉపాధ్యాయ, ఉద్యోగ, న్యాయవాద సంఘాలు, తదితరులతో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకుంటున్నట్టు తెలిపారు. 'ఉమ్మడి రాష్ట్రంలో గిరిజనుల కోసం తీసుకువచ్చిన జీవో నెంబర్-3ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. దీన్ని పునరుద్ధరించాలని వివిధ గిరిజన సంఘాల నుంచి దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం స్పందించి గిరిజన ప్రాంతాల్లో అభిప్రాయాలు సేకరించాలని చెప్పింది. వచ్చిన అభిప్రాయాల్లో ముఖ్యమైన వాటిని ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందిస్తాం. ఈ విషయమై ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణి, ముఖ్య కార్యదర్శి ఎం.ఎం.నాయక్‌లతో చర్చించాం. భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు గిరిజనులకు ఎదురుకాకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యం' అని సదా భార్గవి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దిలీప్ చక్రవర్తి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాత్సవ రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ న్యాయ సలహాదారు పల్లా త్రినాథరావు, ఏపీవో ఎ.మురళీధర్, గిరిజన సంక్షేమశాఖ డీడీ ఆర్.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ సదా భార్గవి

ఎవరెవరు ఏమన్నారంటే..

రాజ్యాంగ సవరణ చేసి జీవో నెంబర్-3కు చట్టబద్ధత కల్పించాలని మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజ్ అన్నారు. గిరిజనులకు మేలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి మాట్లాడుతూ.. గిరిజనులకు సమానత్వం కలిగించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ ఆచరణలో కనబడడం లేదన్నారు. గిరిజన ప్రాంతాల్లో నూటికి నూరు శాతం ఉద్యోగాలు గిరిజనులకే కేటాయించాలని అన్నారు. గిరిజన సంఘ నాయకుడు ఆరిక విప్లవకుమార్ మాట్లాడుతూ.. ఐదో షెడ్యూల్డ్‌లో ఉన్న తమను ఆరో షెడ్యూల్డ్‌లోకి పంపేలా కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేయాలని కోరారు. గిరిజనులకు అప్పుడే

(మిగతా 8వ పేజీలో..)

బడి బయటే బాల్యం!

- డ్రాపౌట్లుగా గిరిజన విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు
- పర్యవేక్షించని పాఠశాల సిబ్బంది
- కొండపోడు పనుల్లో చిన్నారులు
- ప్రభుత్వ ఆశయానికి తూట్లు



గడిచిన రెండేళ్లుగా బడికి దూరమై కొండపైన నిమ్మకాయలు ఏరుకుంటున్న సవర సిద్ధు

సీతంపేట రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీనిపై అధికారులు, ఉపాధ్యాయులకు ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేసింది. అయితే సీతంపేట ఐటీడీఏ పరిధిలో మాత్రం భిన్న పరిస్థితి నెలకొంది. ఇక్కడ డ్రాపౌట్ల సంఖ్య రోజురోజుకూ గణనీయంగా పెరుగుతోంది. సొంత ఊరు, ఇళ్లు, తల్లిదండ్రులను విడిచి ఉండలేక గిరిజన చిన్నారులు పాఠశాలల్లో చేర్పించిన నెలల వ్యవధిలోనే తిరిగి ఇంటిదారి పడుతున్నారు. కొండపోడు వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సేకరణ వంటి పనులు చేసుకుంటూ వారి తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నారు. అయితే ఇటువంటి విద్యార్థులను గుర్తించి తిరిగి బడిలో చేర్పించాల్సిన అధికారులు, పాఠశాల సిబ్బంది ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. వారి తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యత ఇతరత్రా అంశాలపై అవగాహన కల్పించడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

ఇదీ పరిస్థితి..

గిరిజన విద్య బలోపేతానికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది. ప్రధానంగా సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, పిల్లల చదువు భారం కాకుడదనే ఉద్దేశంతో 'తల్లికి వందనం' పథకం, ఉచితంగా నోట్, టెక్స్ బుక్స్‌తో పాటు బ్యాగ్, యూనిఫాంలను అందజేస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎంతో మంది డ్రాపౌట్లుగా మారుతున్నారు. సీతంపేట ఐటీడీఏకు కూత వేటు దూరంలో ఉన్న గ్రామాల్లోనే అత్యధికంగా బడిబయట పిల్లలున్నట్లు తెలుస్తోంది.

ఐటీడీఏలో ఓ ప్రత్యేక విభాగం

డ్రాపౌట్ల నివారణకు అప్పట్లో సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఓ ప్రత్యేక విభాగం(ప్రాజెక్ట్ మోనటరింగ్ రీసోర్స్ సెంటర్) ఏర్పాటు చేశారు. ఈ విభాగంలో

(మిగతా 8వ పేజీలో..)

పార్వతీపురం ఏఎంసీ చైర్‌పర్సన్‌గా గొట్టాపు గౌరి

6లో

కాస్మెటిక్ చార్జీలకు బదులు కిట్లు

- గిరిజన విద్యార్థులకు పంపిణీ చేస్తాం
- డీటీడబ్ల్యూవో కె.శ్రీనివాసరావు

కూటమితోనే సుపరిపాలన

- మంత్రి సంధ్యారాణి

8లో

ఉద్యాన సాగుకు ఊతం

- ఉపాధి హామీ ద్వారా 18 రకాల పండ్లతోటల పెంపకం
- రైతులు రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి


మరుపల్లిలో డ్రాగన్ ఫ్రూట్స్ పెంపకం

గజపతినగరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి)

ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ఊతం అందిస్తోంది. ఉపాధిహామీ పథకం కింద 18 రకాల పండ్ల తోటల పెంపకానికి రాయితీలు అందిస్తోంది. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. రైతులు తమ పొలంలో మొక్కలు పెంపకం చేపట్టి వాటిఫలాలను వారే తీసుకోవ్చని చెబుతున్నారు. ఒన్ బీ, ఉపాధిహామీ జాబ్ కార్డు అందజేస్తే ఫాంపాండ్ తవ్విస్తారు. తర్వాత రైతులు కోరిన పండ్ల మొక్కలు అందిస్తారు. లేదా రైతులే నేరుగా మొక్కలను కొనుగోలు చేసుకోవచ్చు. తర్వాత రెండు సంవత్సరాల వరకు రైతులకు ప్రోత్సహకాలను అందజేస్తారు. ఉపాధిహామీ పథకం కింద 56 రోజుల పనిదినాలు కూడా కల్పిస్తారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యాన పంటల సాగుకు రాయితీలు ఇచ్చి ప్రోత్సహించే వారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాయితీలను విస్మరించింది. దీంతో ఉద్యాన రైతులు పంటల సాగుకు ఆర్థిక స్థోమత లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యాన పంటలకు సాగుకు రాయితీలను అందజేసి రైతులకు భరోసా కల్పిస్తోంది. దీంతో చాలామంది రైతులు ముందుకు వస్తున్నారు. ఇందుకు అవసరమైన సూచనలు, సలహాలు అధికారులు అందజేస్తున్నారు.


మర్రివలసలో మామిడి, జీడి

● జిల్లాలో 27 మండలాలకు సంబంధించి ఉద్యాన సాగు లక్ష్యాలను సాధించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో 1500 ఎకరాలు లక్ష్యంకాగా ఇప్పటివరకు 650 ఎకరాలకు రైతుల నుంచి అంగీకారం వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరానికి 5,603 ఫాంపాండ్స్ తవ్వించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

● ఉద్యాన పంటల సాగుకు ఆసక్తి చూపిన రైతులు ముందుగా గ్రామసభలో తీర్మానం చేయించాలి. దరఖాస్తు చేసుకున్న రైతుకు సొంతభూమి కలిగిఉండాలి. అలాగే ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డు పొంది ఉండాలి. రైతు వివరాలను ఆ గ్రామానికి చెందిన ఫీల్డుఅసిస్టెంట్ ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. ఆతర్వాత అర్హులైతే ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందుతాయి. గజపతినగరం మండలంలో ఇంతవరకు 279 ఫాంపాండ్స్‌ను తవ్వారు.

పంటల సాగుకు రాయితీలు ఇలా..

మొక్కలు నాటినప్పటి నుంచి 2 ఏళ్లవరకు రైతులకు ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందజేస్తుంది. దుక్కులు, ఎరువులు, కూలీల కోసం రైతులు ఖర్చు చేసుకోవచ్చు. మామిడి, జీడి, సపోటా, కొబ్బరి తదితర పంటలకు ఎకరానికి రూ.1.2 లక్షలు ప్రభుత్వం ఇస్తుంది. డ్రాగన్ ఫ్రూట్స్ పంటకు అర ఎకరానికి రూ.1.99 లక్షలు అందజేస్తుంది. అలాగే జామి పంటలకు నాలుగున్నర ఎకరాలకు రూ.2 లక్షలు ఇస్తుంది. పొలాల్లో వాననీటి సద్వినియోగం కోసం రూ.66వేలతో ఫాంపాండ్‌లను ఏర్పాటు చేస్తుంది.


గంగచోళ్ల పెంటలో ఫాంపాండ్ నిర్మాణాలు


ప్రజాప్రతినిధులతో సమావేశమైన ఆర్డీవో దీప్తి

ముగిసిన బీఎల్వోల శిక్షణ

- తప్పుల్లేని ఓటర్ల జాబితాయే లక్ష్యంగా నిర్వహణ
- ప్రజాప్రతినిధులతో ఆర్డీవో సమావేశం

విజయనగరం రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తప్పుల్లేని ఓటర్ల జాబితాయే లక్ష్యంగా రాష్ట్ర ఎన్నికల సంఘం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్న బూత్ లెవల్ అధికారులు (బీఎల్వో)కు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించింది. ఈ మేరకు విజయనగరం నియోజకవర్గ పరిధిలోని మండలం, నగరంలో గల 260 పోలింగ్ బూత్‌లకు గాను బూత్‌కి ఒక్కొక్కరు చొప్పున మొత్తం 260 మంది బీఎల్వోలకు శిక్షణ ఇచ్చారు. ఈనెల 10న విజయనగరంలోని రెవెన్యూ కల్యాణ మండపంలో ఆర్డీవో దాట్ల దీప్తి ఆధ్వర్యంలో విజయనగరం తహసీల్దార్ ఎన్.కూర్మనాథరావు, డీటీ గాంధీ, రెవెన్యూ అధికారి పొందల శివశంకర్, మాస్టర్ ట్రైనీలు ఎస్.మధు, ఇంకుల వెంకటేష్‌ల పర్యవేక్షణలో బీఎల్వోలకు శిక్షణ ప్రారంభించారు. ఓటరు నమోదు, చిరునామా, ఇతర వివరాల మార్పు, చనిపోయిన వారిని జాబితా నుంచి తొలగింపు, ఒక పోలింగ్ బూత్ నుంచి మరో పోలింగ్ బూత్‌కు మార్పు, వలస ఓటర్లు.. తదితర ప్రక్రియ అంతా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా చేయడంపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ గురువారంతో ముగిసింది. అంతక ముందు ఓటర్ల జాబితా విషయమై ఆర్డీవో చాంబర్‌లో ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. వారి నుంచి కూడా అభిప్రాయాలను తీసుకున్నారు. ఎన్నికల సంఘం తదుపరి షెడ్యూల్ ఇచ్చిన వెంటనే బీఎల్వోలు అంతా వారికి నిర్దేశించిన ప్రాంతాల్లో ఓటర్ల నమోదు ప్రక్రియలో పాల్గొనున్నారు.

1,200 ఓటర్లు దాటితే ప్రత్యేక పోలింగ్ కేంద్రం..

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విజయనగరం నియోజకవర్గ పరిధిలో ఎక్కడైనా 1,200 ఓటర్లు ఒక పోలింగ్ కేంద్రంలో ఉంటే, అటువంటి సందర్భంలో ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్టు రెవెన్యూ అధికారులు గాంధీ, పొందల శివశంకర్‌లు చెప్పారు. ఆర్డీవో దాట్ల దీప్తి, తహసీల్దార్ కూర్మనాథరావు ఆదేశాల మేరకు ఏడు రోజుల పాటు బీఎల్వోలకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు మధు, వెంకటేష్, ఉమామహేశ్వరరావు, ప్రతిమ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

- ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక సబ్ కంట్రోల్ రూం
- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో సీసీ కెమెరాలు మరిన్ని అమర్చాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేకంగా సబ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. ఈ రూంను ఎస్పీ ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిందన్నారు. పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, సినిమాహాల్స్ పరిసరాల్లో ఉండడంతో ఉదయం, సాయంత్రం పూట ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటోందన్నారు. దీన్ని అరికట్టడానికి ట్రాఫిక్ సబ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని తెలిపారు. తీవ్రమైన వర్షాల్లో, వేసవి కాలంలో విధులు నిర్వహించడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. ఈ రూంలో ఒక ఎస్ఐ, ఒక ఏఎస్ఐ, ఇద్దరు హెచ్‌సీలు, ముగ్గురు కానిస్టేబుళ్లు ఉంటారన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ సూరినాయుడు, టూటౌన్ సీఐ శ్రీనివాసరావు, రూరల్ సీఐ లక్ష్మణరావు, ఎస్ఐలు భాస్కరరావు, రవి,నూకరాజు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సబ్ కంట్రోల్ రూంను ప్రారంభిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్


మాట్లాడుతున్న ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను అమలు చేయాలి

- ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

పార్వతీపురం టౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ భద్రతపై గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఇచ్చిన సర్క్యులర్ నంబరు 01/2019ను అమలు చేయాలని ఏపీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.దామోదరరావు అన్నారు. గురువారం పార్వతీపురంలో జరిగిన ఏపీపీటీడీ ఈయూ జిల్లా నిర్మాణసభలో ఆయన మాట్లాడుతూ ఏపీఎస్‌ఆర్టీసీ విలీనం అయిన తరువాత మెరుగైన వైద్యం అందక 350 మంది ఉద్యోగులు మృత్యువాత పడ్డారన్నారు. అలాగే మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు ఇవ్వాలని, విలీనానికి ముందు పెండింగులో ఉన్న కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. 24 నెలలుగా ఉద్యోగులకు చెల్లించాల్సిన 11 పీఆర్సీ అరియర్సు, డీఏ బకాయిలు పెండింగులో ఉన్నాయన్నారు. త్వరలో ప్రవేశపెట్టబోతున్న విద్యుత్ బస్సులన్నీ ఆర్టీసీ ద్వారా నిర్వహించి, సంస్థ సిబ్బందితోనే నడపాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రవేశ పెట్టకముందే 3వేల బస్సులను కొనుగోలు చేయాలన్నారు. ఈయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.సుందరరావు, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పి.భానుమూర్తి పాల్గొన్నారు.

ఆదరించి ఆశీర్వాదం ఇవ్వండి

- సినీనటుడు నారాయణమూర్తి


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న నారాయణమూర్తి

పార్వతీపురం టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): త్వరలో విడుదల కానున్న యూనివర్సిటీ పేపర్ లీక్ చిత్రాన్ని ఆదరించి, ఎప్పటిలాగే ఆశీర్వాదాన్ని అందించాలని సినీనటుడు, దర్శకుడు, నిర్మాత ఆర్.నారాయణమూర్తి కోరారు. గురువారం త్వరలో విడుదల కానున్న యూనివర్సిటీ పేపర్ లీక్ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా పట్టణంలోని వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్నేహచిత్ర బ్యానర్‌పై యూనివర్సిటీ పేపర్ లీక్ చిత్రాన్ని తెరకెక్కించామన్నారు. సేవారంగంలో ఉన్న విద్య, వైద్యాన్ని జాతీయం చేయాలని కోరుతూ పేపర్ లీక్ చిత్రంలో చూపించినట్లు చెప్పారు. ర్యాంకుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల మెదడును దొలిచేసి వారి నుంచి ఫీజులు దోపిడీ చేస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలకు కనువిప్పు కలిగించేలా ఈ చిత్రం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కవి గంటేడ గౌరునాయుడు, ఎస్‌వీడీ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.


బొబ్బిలి గిరిజన బాలికల ఆశ్రమపాఠశాలను తనిఖీ చేస్తున్న డీటీడబ్ల్యూవో శ్రీనివాసరావు

కాస్మెటిక్ చార్జీలకు బదులు కిట్లు

- గిరిజన విద్యార్థులకు పంపిణీ చేస్తాం
- డీటీడబ్ల్యూవో కె.శ్రీనివాసరావు

బొబ్బిలి, జూలై 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 19 గిరిజన బాలికల ఆశ్రమపాఠశాలు, కళాశాలలున్నాయని, వాటిలో చదువుతున్న 5వేల మంది విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలకు బదులుగా కిట్లు పంపిణీ చేస్తామని జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అండ్ ఎంపవర్‌మెంట్ అధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. బొబ్బిలి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థుల తరగతి గదులను, హాస్టల్ నిర్వహణ, బోధనా తీరును ఆయన పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. గతంలో విద్యార్థులకు నెలవారీ కాస్మెటిక్ చార్జీలను బ్యాంకు అకౌంట్లలో జమ అయ్యేవని, ఇప్పుడు ఆ డబ్బులకు బదులుగా రెండేసి కిట్లు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రీమెట్రిక్ చదువుతున్న బాలురకు నెలకు రూ.125 ఇచ్చేవారని, ఈ మొత్తాన్ని రూ.150కు ప్రభుత్వం పెంచిందని అన్నారు. పోస్టుమెట్రిక్ బాలికలకు రూ.130 నుంచి రూ.200 రూపాయలకు పెంచిందన్నారు. బాలురకు హెయిర్ కటింగ్ కోసం ప్రత్యేకంగా నెలకు రూ.50 చొప్పున పంపిణీ చేస్తామన్నారు. ప్రీమెట్రిక్ రెసిడెన్షియల్ పిల్లల బట్టల జతకు కుట్టుచార్జీల కింద రూ.80 చొప్పున మంజూరు చేస్తున్నారన్నారు. బాలికలకు కాస్మొటిక్స్‌తో పాటు శానిటరీ నేప్కిన్స్ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో 8 శాతం కన్నా తక్కువగా హిమోగ్లోబిన్ ఉంటే వారికి అదనంగా ప్రొటీన్స్ ఉండే గుడ్లు, చక్కీలు అందజేస్తామన్నారు.

క్రీడాకారిణి భవానికి ఇల్లు

- మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశం

విజయనగరం కలెక్టరేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కజికిస్తాన్‌లో ఇటీవల జరిగిన జూనియర్ ఆసియన్ చాంపియన్‌షిప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో వరుసగా 3 బంగారు పతకాలను సాధించిన కొండకరకాం క్రీడాకారిణి రెడ్డి భవానీని గురువారం కలెక్టరు బీఆర్ అంబేడ్కర్ తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. శాలువా జ్ఞాపికతో సత్కరించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ తరపున రూ.25 వేలు చెక్కు రూపంలో అందజేశారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సాధించాలని కోరారు. భవానీ నేపథ్యం, ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న కలెక్టరు అప్పటికప్పుడు విజయనగరం తహసీల్దార్ కూర్మనాథరావును పిలిచి వెంటనే ఇంటిపట్టా మంజూరు చేయాలని ఆదేశించారు అలాగే హౌసింగ్ పీడీ మురళీమోహన్‌ను పిలిచి ఇల్లు మంజూరు చేయడమే కాకుండా నిర్మాణ బాధ్యతను కూడా చూడాలన్నారు.


క్రీడాకారిణి భవానీని అభినందిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్



వైసీసీని వీడి టీడీపీలోకి..

- ఎమ్మెల్యే బేబీనాయన సమక్షంలో చేరిక

బొబ్బిలి, జులై 17 (ఆంధ్రజ్యోతి): రామభద్రపురం మండలం ఆరికతోటకు చెందిన 15 కుటుంబాలు గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. కోటలో జరిగిన కార్యక్రమంలో మీసాల గౌరీశంకర్, నల్ల కూర్మారావు, పల్లా చంద్రరావు, బేత సోమినాయుడు, సంగిరెడ్డి ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్యే బేబీనాయన పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో బేబీనాయన చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై వైసీపీని వీడి టీడీపీలో చేరినట్లు తెలిపారు.

పార్వతీపురం ఏఎంసీ చైర్‌పర్సన్‌గా గొట్టాపు గౌరి


గొట్టాపు గౌరి

పార్వతీపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఏఎంసీ చైర్‌పర్సన్‌గా గొట్టాపు గౌరి నియమితులయ్యారు. గురువారం రాత్రి ఈమేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. గౌరి గతంలో పార్వతీపురం మండల ఉపాధ్యక్షురాలుగా పనిచేశారు. పార్టీలో ఆమె స్వగ్రామం నర్సిపురం. భర్త వెంకటరమణ తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ సేవలందిస్తున్న ఈ కుటుంబానికి తగు ప్రాధాన్యం ఇవ్వడంపై ఎమ్మెల్యే విజయచంద్రను అభినందిస్తున్నారు. తనపై ఎంతో నమ్మకంతో ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యేకి రుణపడి ఉంటామని గౌరి అన్నారు. పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందనడంలో తానే ఒక ఉదాహరణ అన్నారు. ఏఎంసీ ద్వారా రైతులకు సేవలను అందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తానని చెప్పారు.

నారాయణపురం కుడి కాలువకు నీటి విడుదల

- ప్రతి ఎకరాకూ నీరందిస్తాం: ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు


నీరు విడుదలచేసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఎచ్చెర్ల/సంతకవిటి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల, పొందూరు, సంతకవిటి మండలాలకు నారాయణపురం ఆనకట్ట వద్ద కుడి కాలువ ద్వారా సాగునీటిని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు గురువారం విడుదల చేశారు. కొన్నేళ్లు గా ఈ కాలువ పనులు చేపట్టక పోవడంతో సాగునీటి సరఫరా కష్టమైందని ఎమ్మెల్యే అన్నారు. రైతుల ఇబ్బందులను గమనించి కాలువ పనులు చేసి నీరు విడుదల చేశామన్నారు. నారాయణపురం ఆనకట్ట కుడి, ఎడమ కాలువల ద్వారా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని 37,500 ఎకరాలకు నీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. రూ.3 కోట్లతో కుడి, ఎడమ కాలువలు, ఉప కాలువల పూడికతీత, మరమ్మతులు చేపట్టినట్టు తెలిపారు.

● జలవనరులశాఖ ఎస్ఈ పి.సుధాకర్ మాట్లాడుతూ జైకా పనులు నిలిచి పోయాయని, ఆయకట్టు కుడి, ఎడమ కాలువల ఆధునీకీకరణ కోసం మళ్లీ రూ.177 కోట్లతో ప్రతిపాదన తయారు చేస్తున్నామని తెలిపారు.

● నారాయపురం ప్రాజెక్ట్ కమిటి చైర్మెన్ ఢిల్లీశ్వరరావు మాట్లాడుతూ రైతులకు సాగునీటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడటమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. జలవనరుల శాఖ ఈఈ పి.సుధాకరరావు, డీఈఈ రవీంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఢిల్లీశ్వరరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

జిల్లాలోని మూడు రైల్వే స్టేషన్ల అభివృద్ధికి చర్యలు

విజయనగరం కలెక్టరేట్, జూలై 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర రైల్వే శాఖ ఆధ్వర్యంలో అమృత స్టేషన్ల అభివృద్ధిలో భాగంగా జిల్లాలోని మూడు రైల్వే స్టేషన్లు అభివృద్ధి కానున్నాయి. ఆధునిక హంగులతో స్టేషన్లు అభివృద్ధి కానున్నాయి. రూ.2,051కోట్లతో రాష్ట్రంలోని 73 అమృత స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారు. దీనిలో భాగంగా జిల్లాలోని బొబ్బిలి, చీపురుపల్లి, విజయనగరం స్టేషన్లను అభివృద్ధి చేయనున్నారు. ఈ స్టేషన్లలో ఆధునిక హంగుల తోపాటు విద్యుదీకరణ చేపట్టనున్నారు. కనీస సదుపాయాలు ఉండే విధంగా చర్యలు తీసుకుంటారు. అలాగే టాయిలెట్స్, మంచి నీరు సదుపాయం, ప్రయాణికులకు అదనంగా విశ్రాంతి గదులు సమకూర్చే అవకాశాలు ఉన్నాయి.

శాశ్వత శ్మశానవాటికను ఏర్పాటు చేయండి

శృంగవరపుకోట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కిల్తంపాలెం శివారు రామన్నపాలెం దళితులకు, వెంకటరమణపేట శివారు కొండమల్లిపూడి గ్రామ గిరిజనులకు శాశ్వత శ్మశానవాటికను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు గాడి అప్పారావు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ డి.శ్రీనివాసరావుకు దళితులు, గిరిజనులతో కలిసి వినతిపత్రం అందించారు.

దళితుల ఆత్మగౌరవ పోరాటమే కారంచేడు

శృంగవరపుకోట, జూలై 17(ఆంధ్రజ్యోతి): దళితుల ఆత్మగౌరవ పోరాటానికి కారంచేడు కేంద్ర బిందువని దళిత ఉద్యమ నేత ఆతవ ఉదయ భాస్కర్ అన్నారు. కారంచేడు ఉద్యమానికి 40 ఏళ్లు అయిన సందర్భంగా అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఎస్.కోటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అమరులకు నివాళులు అర్పించారు. జోల కేశవ, గుర్రపు శ్రీను, బోనెల ఈశ్వరరావు, ఎం.వెంకటరమణ, డెంకాడ సోమేష్ పాల్గొన్నారు.

భవానీకి అశోక్ అభినందన

విజయనగరం రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): కజికిస్థాన్‌లో ఏషియన్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో విజయం సాధించిన రెడ్డి భవానీని కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు గురువారం తన నివాసంలో అభినందించారు. భవానీ భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి, ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆశీర్వదించారు.

22న ప్రతిభా పురస్కారాల అందజేత

విజయనగరం రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కస్పా హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ఇచ్చే కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 22న నిర్వహించనున్నట్టు ఆ సంఘం ప్రతినిధులు రామరాజు, పెద్దింటి అప్పారావు, రంగారావు దొర తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 22న ఉదయం 10 గంటలకు అదే పాఠశాలలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.

గ్రామాల పరిశుభ్రత అందరి బాధ్యత

భోగాపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల పరిశుభ్రత అందరి బాధ్యతగా తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి డీవీ మల్లికార్జునరావు సూచించారు. చెరుకుపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పనులు నిరంతరం నిర్వహిస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో గాయత్రీ, కార్యదర్శి బి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డుల తనిఖీ

సంతకవిటి, జూలై 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ ఆడిటర్ ఎం.కవిత ఆధ్వర్యంలో 10 పంచాయతీలకు సంబంధించిన రికార్డులను వార్షిక ఆడిట్‌లో భాగంగా గురువారం తనిఖీ చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఆడిటర్ వై.భాగ్యలక్ష్మి, నీలలోహిత్ పాల్గొన్నారు.

నేడు సినీ నటుడు సుమన్ రాక

విజయనగరం రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు సుమన్ శుక్రవారం విజయనగరం రానున్నారు. కొత్తపేటలో ఉన్న సంపత్ వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అదేవిధంగా నగరంలోని రంగిరీజు వీధిలో ఏపీ భావసార క్షత్రియ అసోసియేషన్, ఉత్తరాంధ్ర భావసార క్షత్రియ అసోసియేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న ఎడ్యుకేషనల్ ట్రస్టుని ఆయన ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకుడు సుమన్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్సీ విద్యార్థుల కోసం ఐఐటీ, నీట్ కోచింగ్

చీపురుపల్లి, జూలై 17 (ఆంధజ్యోతి): చీపురుపల్లి గురుకుల కళాశాలలో ఐఐటీ, నీట్ కోచింగ్‌కు ఎస్సీ విద్యార్థుల(బాలికలు) కోసం ఉద్దేశించిన సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రాణిశ్రీ తెలిపారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతిలో 500 మార్కులు దాటిన ఎస్సీ విద్యార్థులు ఈనెల 31లోగా నేరుగా కళాశాలకు వచ్చి కోచింగ్‌లో చేరవచ్చునని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వాలీబాల్ పోటీల్లో 'ఆపరేషన్ సర్కిల్' ప్రతిభ

విజయనగరం రింగురోడ్డు, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ ఇంటర్ సర్కిల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ఈనెల 15 నుంచి 17 వరకు శ్రీశైలం రెడ్ బ్యాంక్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో విజయనగరం ఆపరేషన్ సర్కిల్ ప్రథమ స్థానం కైవసం చేసుకున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.త్రినాథరావు తెలిపారు.

తెరుచుకోని తూడెం పంచాయతీ కార్యాలయం

- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- వాహనాల షెడ్డుగా మారిన వైనం

భోగాపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): తూడెం గ్రామంలోని పంచాయతీ కార్యాలయం గత మూడు నెలలుగా సక్రమంగా తెరుచుకోవడం లేదు. అలాగే గ్రామంలో పంచాయతీ కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో స్థానికులు అన్ని పనులకూ పక్క సచివాలయంపై ఆధారపడాల్సి వస్తోంది. ఇక్కడ కార్యదర్శి ఈ ఏడాది ఏప్రిల్‌లో బదిలీ అయ్యారు. ఇప్పటివరకు కొత్త కార్యదర్శిని నియమించలేదు. మరో కార్యదర్శికి అదనపు బాధ్యతలు అప్పగించగా.. ఆయన సక్రమంగా రావడంలేదు. దీంతో స్థానికులు అవస్థలు పడాల్సి వస్తోంది. తాగునీటి ట్యాంకు శుభ్రం చేయడంలేదని, పారిశుధ్య నిర్వహణ గాడి తప్పిందని స్థానికులు వాపోతున్నారు. ఈ పంచాయతీ కార్యాలయం తెరవకపోవడంతో స్థానికులు వాహనాల షెడ్డుగా ఉపయోగించుకుంటున్నారు.

తెరిచేలా చర్యలు తీసుకుంటాం

తూడెం పంచాయతీ కార్యదర్శి ఏప్రిల్‌లో బదిలీపై వెళ్లారు. మళ్లీ ఇక్కడ ఎవరినీ నియమించలేదు. మరో కార్యదర్శికి ఇన్‌చార్జి ఇచ్చారు. సమస్య లేకుం డా కార్యాలయం తెరిచేలా చర్యలు తీసుకుంటాం.

– గాయత్రి, డిప్యూటీ ఎంపీడీవో, భోగాపురం



కార్యాలయంలో వాహనాలు పార్కింగ్ చేసిన దృశ్యం

హామీలన్నీ అమలు చేశారు

కొత్తవలస, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమలు చేశారని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. గురువారం కొత్తవలస పంచాయతీ చీపురువలస గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి, సమస్యలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలపై వివరించారు. అనంతరం గ్రామ మహిళలు ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

కూటమితోనే సుపరిపాలన

నెల్లిమర్ల, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. టీడీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ ఆధ్వర్యంలో గరికిపేట గ్రామంలో గురువారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, లంక అప్పలనాయుడు, చింతపల్లి సత్యనారాయణ, బెల్ల, చిన్నప్పడు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న బంగార్రాజు, రవిశేఖర్

జనసేన అభివృద్ధికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే నాగమాధవి



జనసేన నాయకులతో ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి భోగాపురంలోని జనసేన పార్టీ కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించి, మాట్లాడారు. పార్టీని అభివృద్ధి చేసే బాధ్యత జనసైనికులదే అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లట్ల జగదీష్, బొల్లు త్రినాథ్, మాతా నవీన్, గుండపు సూర్యారావు, వరుపుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆనంద గజపతిరాజు ఆశయ సాధనకు కృషి



వృద్ధులకు పండ్లు, దుస్తులు పంపిణీ చేస్తున్న ఊర్మిళా గజపతిరాజు

విజయనగరం కల్చరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ మంత్రి, మాన్సాస్ పూర్వపు చైర్మన్ ఆనంద గజపతిరాజు ఆశయ సాధనకు కృషి చేస్తామని ఆయన కుమార్తె ఊర్మిళా గజపతిరాజు చెప్పారు. ఆనంద గజపతిరాజు జయంతిని పురస్కరించుకుని తల్లి సుధా గజపతిరాజుతో కలిసి ఆమె గురువారం ప్రేమసమాజంలో పర్యటించారు. వృద్ధులు, అనాథల మధ్య కేక్ కట్ చేశారు. ఆనంద గజపతిరాజు భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన సిద్ధాంతాలు ప్రజల్లో ఉన్నాయని ఆమె కొనియాడారు. అనంతరం వృద్ధులకు పండ్లు, రొట్టెలు, వస్త్రాలను పంపిణీ చేశారు. ప్రేమసమాజంలో ఉన్న పీవీజీ రాజు విగ్రహంతో పాటు, పలు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఏఎంసీ చైర్మన్ల నియామకం

మెరకముడిదాం/గరివిడి, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తాజాగా గురువారం రాత్రి ప్రకటించిన ఏఎంసీ చైర్మన్ల జాబితాలో మెరకముడిదాం ఏఎంసీ చైర్మన్‌గా తాడ్డి చంద్రశేఖర్(చందు), చీపురుపల్లి ఏఎంసీ చైర్మన్‌గా రేగాన రామారావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. చంద్రశేఖర్‌కు అతి పిన్నవయస్సులో ఏఎంసీ చైర్మన్ దక్కడంపై స్థానికులు అభినందనలు తెలిపారు. ఈయన స్వగ్రామం గర్భాం. చీపురుపల్లి ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన రేగాన రామారావు గరివిడి మండలం అప్పన్నవలస గ్రామానికి చెందిన వ్యక్తి.

- నెల్లిమర్ల, జూలై 17(ఆంధ్రజ్యోతి): పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గేదెల గాయత్రిని అధిష్ఠానం ప్రకటించింది. నెల్లిమర్ల మండలం దనానపేట గ్రామానికి చెందిన గాయత్రికి ఏఎంసీ పీఠం దక్కింది. ఈమె గతంలో దనానపేట సర్పంచ్‌గా చేశారు. ఈమె భర్త గేదెల రాజారావు తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. గాయత్రి ఎంపిక పట్ల టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి, విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్ అభినందనలు తెలిపారు.

అశోక్ గజపతిరాజుకు అభినందనలు

విజయనగరం రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ గురువారం విజయనగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గోవా గవర్నర్‌గా నియమితులైన సందర్భంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పాల్గొన్నారు. ● కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజుని జనసేన నాయకుడు అవనాపు విక్రమ్ గురువారం ఆయన నివాసంలో కలిసి, అభినందనలు తెలిపారు. ఆయన తోపాటు కాళ్ల గౌరీశంకర్, కాళ్ల రూప, కాళ్ల గౌతమ్, సంపత్‌రాజు, మారేష్, ఖాదర్ ఉన్నారు.



అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితితో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

పైడిమాంబ సేవా సంఘం ఆధ్వర్యంలో సత్కారం

విజయనగరం కల్చరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజును పైడిమాంబ ఆధ్యాత్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. అశోక్ దంపతులకు సేవా సంఘం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో శాలువా కప్పి, సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు.

పీ-4 సర్వేను పూర్తి చేయాలి

- నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం రింగురోడ్డు, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన పీ-4 సర్వే అనంతరం బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల అనుసంధాన ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా త్వరితగతిన పూర్తిచెయ్యాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య కార్యదర్శులకు ఆదేశించారు. గురువారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల అనుసంధాన ప్రక్రియ ఏ విధంగా చేపట్టాలన్న విషయమై రాష్ట్ర శాఖ వీసీ ద్వారా వివరించారు. ఈసందర్భంగా కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో పీ-4 సర్వే జరిగిన అనంతరం బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల అనుసంధాన ప్రక్రియ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగానే వాటి విధివిధానాలను సంబంధిత అధికారులు తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఆర్వో సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాశిరావు పాల్గొన్నారు.

అంతికాపల్లిలో తాగునీరు పరిశీలన

రాజాం, జూలై 17(ఆంధ్రజ్యోతి): అంతికాపల్లి గ్రామంలో 18 బోర్లు ఉన్నప్పటికీ తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. దీనిపై అధికారులు దృష్టి సారించారు. తాగునీటిలో బ్యాక్టీరియా ఉందనే ఆలోచనతో గురువారం ఆ గ్రామంలోని బోర్లలో నీటిని పరిశీలించి, శాంపిల్ తీసి టెస్టింగ్‌కు పంపించారు. ఈసందర్భంగా ఎంపీడీవో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తాగునీటి శాంపిల్‌ని తీసి పీఆర్ ఒన్ యాప్‌లో అప్లోడ్ చేశామని చెప్పారు. గ్రామంలో రక్షిత తాగునీటి పథకాన్ని పరిశీలించారు. ట్యాంకు శుభ్రం చేసి తాగునీరు అందించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈయనతో పాటు పంచాయతీ కార్యదర్శి, ఏఎన్‌ఎం, ఈఏ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గజపతినగరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని గజపతినగరం రూరల్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని బొబ్బిలి డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.రఘు బుధవారం తెలిపారు. మధుపాడ, మరుపల్లి, తమ్మారాయుడుపేట, ఎం.గుమడాం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. ● లక్కవరపుకోట: మండలంలో ఖాసాపేట, కొట్యాడ, ఎల్.కోట, తలారి, రెల్లి గౌరమ్మపేట, కూర్మవరం గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విజయనగరం రూరల్ ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. ఉదయం 8 నుంచి 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని చెప్పారు. ● దత్తిరాజేరు: కోమటిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.రఘు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.శివ కుమార్‌లు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తారని చెప్పారు.

● మెరకముడిదాం: మండలంలో గర్భాం, సోమలింగాపురం సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈ శ్రీనాథ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణ, ఏఈ దివాకర్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. ● భోగాపురం: మండలంలోని సవరవల్లి, ఉప్పాడపేట, రావాడ, బసవపాలెం, తూడెం, కవులవాడ గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఏఈ మస్తాన్ వలి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

● విజయనగరం రింగురోడ్డు: నగరంలోని కలెక్టరేట్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పను ల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు పి.త్రినాథరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా కనపాక, సంజీవయ్య కాలనీ, బీసీ కాలనీ, ఆర్టీవో ఆఫీస్, సాయి లలితనగర్, సాయి కీర్తన నగర్, ద్వారపూడి రోడ్డు, కోయినగర్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఆయన చెప్పారు.

ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయాలి

- జిందాల్ కార్యాలయం వద్ద యువత నిరసన

శృంగవరపుకోట రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న జిందాల్ భూముల్లో వేగవంతంగా ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయాలని యువత డిమాండ్ చేశారు. ఎస్.కోట పట్టణంలో ఉన్న పలు కళాశాలల విద్యార్థులతో పాటు పలు గ్రామాల యువత గురువారం జిందాల్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ ఇక్కడ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేసి, ఉద్యోగాలు కల్పించాలని కోరారు. అనంతరం పోలీసులు అక్కడకు వచ్చి, వారిని పంపించేశారు.



జిందాల్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న యువత

యువత ఆకాంక్షను స్వాగతిస్తున్నాం

జిందాల్ కార్యాలయం వద్ద ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుచేయాలన్న యువత ఆకాం క్షను స్వాగతిస్తున్నామని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘు రాజు తెలిపారు. ఈ విషయంపై గురువారం ఆయన బొడ్డవరలో తన నివాసంలో మాట్లాడారు. ఈ విషయాన్ని ప్రభుత్వం వెంటనే పరిగణలోకి తీసుకోవాలన్నారు. ముందుగా జిందాల్ నిర్వాసితుల సమస్యలపై జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వం ఏర్పాటుచేసే ఈ పరిశ్రమల్లో నిర్వాసితులకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నిరసన చేస్తున్న యువతపై పోలీసులు కేసులు నమోదు చెయ్యవద్దని కోరారు.

మాది శాంతియుత పోరాటం

శృంగవరపుకోట రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఎస్పీ వకుల్ జిందాల్ గారూ.. జిల్లాలో అమలు చేస్తున్న సెక్షన్-30 తమకు మాత్రమే వర్తిస్తున్నారని బొడ్డవర గ్రామంలో గత 25 రోజులుగా శాంతిపోరాటం చేస్తున్న జిందాల్ నిర్వాసితులు ప్రశ్నించారు. గురువారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. తమకు జిందాల్ యాజమాన్యం ఇవ్వాల్సిన పరిహారం ఇవ్వాలని శాంతియుతంగా పోరాడుతుంటే.. సెక్షన్-30 అమల్లో ఉందని పోలీసులు చెబుతున్నారన్నారు. ఇదే పోలీసులు జిందాల్ కార్యాలయం వద్దకు వందలాదిమంది వెళ్లి పరిశ్రమలు కావాలని నిరసన చేస్తే పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. తమ నిరసనకు అనుమతులు ఇవ్వాలని కోరారు.



మట్లాడుతున్న జిందాల్ నిర్వాసితులు

విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బొబ్బిలి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా విధి వక్రించింది. ఇంటికెళ్లి తల్లిలేని తన కుమార్తెతో మాటా మంతీ ఆడుకుని విశ్రాంతి తీసుకుందామనుకున్న ఆ యువకుడిని మృత్యువు కబళించింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక గ్రోత్ సెంటర్‌లోని బెర్రీ కంపెనీలో జేసీబీ ఆపరేటర్‌గా సత్యనారాయణ చేస్తున్నాడు. అతడు మల్లమ్మపేటలో నివాసముంటున్నాడు. రాత్రి డ్యూటీ ముగించుకుని బైక్‌పై గ్రోత్ సెంటర్ నుంచి పట్టణానికి వస్తుండగా లారీ ఢీకొంది. ప్రమాదంలో సత్యనారాయణ తీవ్ర గాయాల పాలయ్యాడు. కుడి కాలు నుజ్జయిపోయింది. ఎడమ కాలు విరిగిపోయింది. తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలిస్తుండగా మార్గమధ్యంలో సత్యనారాయణ మృతిచెందాడు. సీఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ స్వామి కేసు నమోదు చేశారు. మృతదేహానికి గురువారం బొబ్బిలి సీహెచ్‌సీలో పోస్టు మార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించారు. మృతిచెందిన సత్యనారాయణ మన్యం జిల్లా బలిజిపేట మండలం అరసాడ గ్రామస్థుడు. అతడి భార్య నాగమణి ఏడాదిన్నర క్రితం చనిపోయింది. తొమ్మిది సంవత్సరాల వయస్సు కలిగిన కుమార్తె జ్యోషిణి ఉంది. జేజీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడం పట్ల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి తల్లిదండ్రులు సూర్యనారాయణ, పార్వతి, అన్న వెంకటరమణ ఉన్నారు.

లారీ ఢీకొని రిటైర్డ్ అధికారి మృతి

విజయనగరం క్రైం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విజయనగరం పట్టణంలోని కలెక్టర్ బంగ్లా సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ అధికారి మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నా యి. విజయనగరం పట్టణానికి చెందిన బంగారునాయుడు(63) జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. తాను నివాసం ఉంటున్న కామాక్షినగర్ నుంచి ద్విచక్ర వాహనంపై కలెక్టర్ బంగ్లా వైపు వస్తుండగా.. ఎస్.కోట వైపు నుంచి పట్టణంలోనికి వస్తున్న ఓ లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన అక్క డికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరు కుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తర లించారు. ఈ ఘటనపై వన్ టౌన్ సీఐ ఆర్‌వీఆర్‌కే చౌదరి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

కారు ఢీకొని ఒకరు..

సీతంపేట రూరల్, జూలై17 (ఆంధ్రజ్యోతి): పాలకొండ-హడ్డుబంగి ప్రధాన రహదారిపై కంబగూడ సమీపంలో గురువారం కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో హడ్డుబంగి ఎంపీటీసీ సభ్యురాలు సవర సరోజిని భర్త సవర తవిటిరాజు(48) మృతి చెందారు. పోలీసులు అందించిన వివరాల మేరకు.. మృతుడి స్వగ్రామమైన చీడిమానుగూడ నుండి సీతంపేటకు ద్విచక్ర వాహనంపై వస్తున్న తవిటిరాజును సీతంపేట నుంచి కొత్తూరు వైపు వెళ్తున్న కారు కంబగూడ మలుపు వద్ద బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన తవిటిరాజును స్థానికులు 108 వాహనంలో సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ అమ్మనరావు కేసు నమోదు చేశారు.

యువతిపై వేధింపులకు పాల్పడిన వ్యక్తికి ఏడాది జైలు

విజయనగరం క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): యువతిపై వేధింపులకు పాల్పడిన కేసులో ఓ వ్యక్తికి ఏడాది సాధారణ జైలు, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ విజయనగరం మహిళా కోర్టు కమ్ 5వ ఏడీజే కోర్టు న్యాయాధికారి ఎన్.పద్మావతి తీర్పు వెల్లడించినట్టుగా విజయనగరం మహిళా పీఎస్ డీఎస్పీ ఆర్.గోవిందరావు తెలిపారు. ఆయన గురువారం స్థానిక విలేకర్లకు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి జిల్లాకు చెందిన ముప్పాల అశ్విన్ నెలిమర్ల మిమ్స్ కళాశాలలో 2023 సంవత్సరంలో చదువుతున్న సమయంలో అదే కళాశాలలో చదువుతున్న ఒక యువతితో పరిచయం ఏర్పరుచుకుని వివిధ సందర్భాల్లో ఆమెను వేధించాడు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి మహిళా పీఎస్ ఎస్ఐ పద్మావతి కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కోర్టు విచారణలో అశ్విన్‌రెడ్డి వేధింపులకు పాల్పడినట్లుగా రుజువు కావడంతో ఈ శిక్ష విధించారు. ఈ కేసులో పోలీసువారి తరఫున ఏపీపీ ఎస్.శకుంతల వాదనలు వినిపించగా, అప్పటి ఎస్ఐ ఎన్.పద్మావతి కేసును దర్యాప్తు చేశారు. కోర్టు కానిస్టేబుల్ జి.సూరపునాయుడు, సీఎంఎస్ మహిళా కానిస్టేబుల్ సీహెచ్ సౌజన్య సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపర్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

శృంగవరపుకోట రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): కిల్తంపాలెం పంచాయతీ కరకటజోరు గ్రామానికి చెందిన అప్పారావు అనే ప్రైవేటు ఎలక్ట్రీషియన్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అప్పారావు బుధవారం రాత్రి ఎస్.కోట నుంచి గ్రామానికి వస్తున్న సమయంలో కాపుసోంపురం గ్రామం వద్ద వర్షానికి అరకు-విశాఖ ప్రధాన రహదారిపై చెట్టు కూలింది. ఇది చీకట్లో కనపడకపోవడంతో ద్విచక్ర వాహనంతో ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆయన్ని స్థానికులు ఎస్.కోట ఆసుపత్రికి తరలించారు.

మద్యం ధ్వంసం

రాజాం రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాజాం పట్టణ, పరిసర ప్రాంతాల్లో పలు కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలను గురువారం స్థానిక టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ధ్వంసం చేశారు. విజయనగరం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ దొర పర్యవేక్షణలో రూ.5,500 విలువ చేసే మద్యాన్ని ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ అశోక్‌కుమార్, వీఆర్వోలు అబ్బాస్, కాంతారావు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ రిపేరింగ్ షాపులో అగ్నిప్రమాదం

కొత్తవలస, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస-విజయనగరం రోడ్డులోని స్థానిక పీఎం కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న సంపత్ వినాయక ఎలక్ట్రానిక్ రిపేరింగ్ షాపులో బుధవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు రూ.50వేలు విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. ఇదే షాపు మేడపై అద్దెకు ఉంటున్నవారు రాత్రి షాపులో నుంచి పొగలు రావడం గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో అగ్నిమాపక అధికారి వై.అశోక్‌కుమార్ తన సిబ్బందితో వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ షాపులో రిపేర్లకు ఇచ్చిన వివిధ రకాల రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మిషన్లు, ఇతర సామగ్రి కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.50వేలు ఆస్తి నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా వేశారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

జామి, జూలై 17(ఆంధ్రజ్యోతి): వెన్నె పంచాయతీలో నిధులు దుర్వినియోగం జరిగినట్టు గ్రామానికి చెందిన రంధి భాస్కరరావు జిల్లా గ్రీవెన్స్‌లో చేసిన ఫిర్యాదుపై మండల ఈవోపీఆర్డీ ఉమ గురువారం విచారణ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ రికార్డులను పరిశీలించారు. దీనికి సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు.

పారిశుధ్య కార్మికుల నిరసన

లక్కవరపుకోట, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పారిశుధ్య కార్మికులు గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం పక్కన నిరసన కార్యక్రమం చేపట్టారు. తొమ్మిది నెలలుగా జీతాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు గాడి అప్పారావు, జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్.అప్పారావు, గొల్ల కామేశు, టి.వెంకటరమణ, జి.వెంకటరావు, దేముడమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ పీఏసీఎస్ అధ్యక్షుడిగా ముసలినాయుడు

మెంటాడ జూలై 17(ఆంధ్రజ్యోతి): మెంటాడ పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఆగూరు గ్రామానికి చెందిన జి.ముసలినాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్‌గా పిట్టాడ గ్రామానికి చెందిన రెడ్డి ఆదినారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో జరిగిన ఈ ఎన్నికలో అధ్యక్ష పదవి కోసం ముసలినాయుడు, ఆదినారాయణ పోటీపడగా.. ముసలినాయుడు పేరును అధికారికంగా ప్రకటించారు. మొదటి రెండేళ్లు ముసలినాయుడు, తర్వాత రెండేళ్లు ఆదినారాయణ అధ్యక్షుడిగా వ్యవహరించేలా పెద్దలు రాజీ కుదిర్చారు.

గిరిజన విద్యాలయాలపై పర్యవేక్షణ ఏదీ?

(5వ పేజీ తరువాయి)

ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. అదే విధంగా మందస ఏటీడబ్ల్యూవో ఎం.శ్రీనివాసరావు బదిలీపై అల్లూరి జిల్లా అనంతగిరికి వెళ్లారు. అయితే, పాడేరు ఐటీడీఏ పరిధిలోని అరకు ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు మందసకు బదిలీపై వచ్చారు. ఈయన కూడా ఇక్కడ నుంచి అనంతగిరికి డెప్యుటేషన్‌పై వెళ్లేందుకు ముమ్మర ప్రయత్నాలు చేపట్టారు. దీనికి ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అంగీకరించకపోవడంతో తప్పనిసరి పరిస్థితిలో ఆయన మందసలోనే పనిచేస్తున్నారు. రిలీవర్ రాకుండా ఏ శాఖలో కూడా ఉద్యోగులు బదిలీపై వెళ్లకూడదని ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఉద్యోగుల బదిలీల్లో నిబంధన పెట్టింది. అయినప్పటికీ ఐటీడీఏ అధికారులు పట్టించుకోకుండా రిలీవర్‌లు రాకుండానే సీతంపేట, మెళియాపుట్టి ఏటీడబ్ల్యూవోలను బదిలీ చేశారనే విమర్శలు ఉన్నాయి. దీంతో ఇక్కడ పాలన పరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

పర్యవేక్షణ లోపం..

సీతంపేట, మెళియాపుట్టిలో ఏటీడబ్ల్యూవో పోస్టులు ఖాళీగా ఉండడతో గిరిజన పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడింది. మెనూ అమలులో లోపాలు వెలుగుచూస్తున్నాయి. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులతో పని చేయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సరిపడా భోజనాలు పెట్టకపోవడంతో అర్ధాకలితో చిన్నారులు అలమటిస్తున్నారు. మెనూ అమలులో భాగంగా వారంలో రెండు రోజులు చికెన్ కర్రీని ఒక్కో విద్యార్థికి 100 గ్రాములకు తగ్గకుండా వడ్డించాలి. కానీ, 30 గ్రాములకు(రెండు ముక్కలు) మించి పెట్టడం లేదు. ప్రస్తుతం చాలా గిరిజన పాఠశాలల్లో విద్యార్థులు జ్వరాలతో బాధపడుతున్నారు. సిక్‌రూమ్‌ల్లో పదుల సంఖ్యలో విద్యార్థులు మలేరియా, వైరల్ జ్వరాలతో మూలుగుతున్నారు. కొన్ని రోజుల కిందట సీతంపేట ఏపీఆర్ బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని పాముకాటుకు గురై ప్రాణాపాయం నుంచి బయట పడింది. ఇలా గిరిజన పాఠశాలలపై రెగ్యులర్ సహాయ గిరిజన సంక్షేమాధికారుల పర్యవేక్షణ లేక విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

వేధిస్తున్న వార్డెన్ల కొరత

సీతంపేట ఐటీడీఏ పరిధిలోని పోస్టుమెట్రిక్ వసతిగృహాలను వార్డెన్ల కొరత వేధిస్తోంది. ఐటీడీఏ పరిధిలోని 18 పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో సుమారు 2,740 మంది గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. 18 హాస్టళ్లకు పది మంది మాత్రమే రెగ్యులర్ వార్డెన్లు ఉన్నారు. మిగిలిన ఎనిమిది హాస్టళ్లకు వార్డెన్‌ల కొరత వెంటాడుతోంది. మందస, పాతపట్నం, శ్రీకాకుళం, మెళియాపుట్టి, టెక్కలి, పలాస, కొత్తూరు తదితర వసతిగృహాల్లో రెగ్యులర్ వార్డెన్లు లేరు. ఇతర వసతిగృహాల వార్డెన్లకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. రెండేసి హాస్టళ్ల పర్యవేక్షణ తలకుమించిన భారం కావడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా వార్డెన్ పోస్టుల భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

గిరిజనుల అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

(5వ పేజీ తరువాయి)


వర్క్‌షాప్‌లో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజ్

తగిన న్యాయం జరుగుతుందని అన్నారు. గిరిజన ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు గేదెల రామకృష్ణారావు మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో జిల్లా యూనిట్‌గా తీసుకొని వంద శాతం గిరిజనులకు విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, గిరిజన భాషను నేర్చుకున్న వారికే ఉపాధ్యాయులుగా నియామకం చేపట్టాలని అన్నారు. సమజ సమాజ స్థాపనలో ఆదివాసీలకు అన్ని విధాలా సహకరిం చాలంటే షెడ్యూల్ 5 (1), 5 (2)లపై ఆర్డినెన్స్ తీసుకురావాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అమర్నాథ్ కోరారు. గిరిజనులకు పూర్తిస్థాయిలో అన్నింటా ఉపయోగపడే విధంగా ఆర్డినెన్స్ తీసుకురావాలని చింతలగూడ సర్పంచ్ నిమ్మక సింహాచలం అన్నారు. రిటైర్డ్ సబ్ కలెక్టర్ కె.ధర్మారావు మాట్లాడుతూ.. రద్దు చేసిన జీవోను పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బడి బయటే బాల్యం!

(5వ పేజీ తరువాయి)

డిప్యూటీ ఈవో, ఏఎంవో, సీఎంవో, జీసీడీవో, ఏఏఎంవో వంటి అధికారులు ఉన్నారు. ఉపాధ్యాయుల శిక్షణ, క్వాలిటీ ఎడ్యుకేషన్, డ్రాపౌట్ల నివారణ, విద్యార్థుల విద్యాప్రమాణాల స్థాయి, బాలికల సంరక్షణ, కమ్యూనిటీ మొబలైజేషన్ తదితర అంశాలను ఎప్పటికప్పుడు వారు పర్యవేక్షించాల్సి ఉంది. కానీ సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ఆదిశగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గతంలో డ్రాపౌట్లు ఇలా...

గత వైసీపీ ప్రభుత్వం గిరిజన విద్యపై దృష్టి సారించలేదు. విద్యా ప్రమాణాల మెరుగుకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఎంతోమంది గిరిజన బిడ్డలు చదువుకు దూరమయ్యారు. 2023-2024లో పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా చేపట్టిన డ్రాపౌట్ల సర్వేలో 154మందిని గుర్తించారు. వారిలో 72మందిని పాఠశాలల్లో చేర్పించారు. మిగిలిన 82 మంది ఓవర్ ఏజ్, మైగ్రేట్ అయిన వారిగా గుర్తించారు. ఇక పాలకొండ నియోజకవర్గం పరిధిలో చూస్తే.. భామిని 21, సీతంపేట 31, పాలకొండ 2, వీరఘట్టంలోఆరుగురు డ్రాపౌట్లుగా ఉన్నట్లు గతంలో నిర్వహించిన సర్వే నివేదికలు చెబుతున్నాయి. అయితే గడిచిన (2024-25)ఏడాదికి సంబంధించి డ్రాపౌట్ల సర్వేను ఇంత వరకు చేపట్టలేదు. ఐటీడీఏ పరిధిలో పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్య, లాంగ్ ఆప్సెంట్లను ఒక్కసారి పరిశీలిస్తే డ్రాపౌట్లుగా ఎంత మంది బడి బయట ఉన్నారో ఇట్టే తెలిసిపోతుంది.

డిప్యూటీ ఈవో ఏమన్నారంటే..

సీతంపేట ఐటీడీఏ పరిధిలో బడి బయట ఉన్న పిల్లల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం. వారంతా బడిలోనే ఉండేలా చర్యలు తీసుకుంటాం. పాఠశాలల వారీగా జాబితాలు తెప్పించి.. గ్రామస్థాయిలో పరిశీలిస్తాం.' అని డిప్యూటీ ఈవో జి.రామ్మోహనరావు తెలిపారు.

కూటమితోనే సుపరిపాలన


వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అన్నారు. కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అన్నారు. గురువారం పట్టణంలోని 29వ వార్డులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆమె ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను అందజేశారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, వార్డు ఇన్‌చార్జి సారిక బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంపై దృష్టిసారించండి

●సాలూరు, జూలై17 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల అభివృద్ధి, మహిళలు, పిల్లల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె క్యాంప్ కార్యాలయంలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థలు, రహదారి మరమ్మతులు తదితర వాటిపై అధికారులు, టీడీపీ ముఖ్య నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గస్థాయిలో ప్రస్తుతం అమలులో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలు, వాటి పురోగతి, అలాగే కొత్తగా చేపట్టాల్సిన ప్రాజెక్టులపై సమగ్రంగా చర్చించారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్ల సిబ్బంది నియామకం, వైద్య పరికరాల సరఫరా, మొబైల్ వైద్య వాహనాల వినియోగంపై దృష్టి సారించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల పునరుద్ధరణ, డిజిటల్ క్లాస్‌రూంల ఏర్పాటు, విద్యార్థుల ఉపాధ్యాయుల నిష్పత్తి మెరుగుపరచడం వంటి అంశాలు చర్చించారు. గిరిజన మహిళల కోసం స్వయం సహాయక సంఘాలకు ఫైనాన్సియల్ సపోర్ట్, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. అటవీ ఉత్పత్తులు ప్రాసెసింగ్ యూనిట్లు, వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులు ప్రోత్సాహానికి చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు.

రోగులకు మెరుగైన సేవలు అందించండి


యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆదేశించారు. గురువారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా డెక్కన్ సంస్థ అందించిన సీఆర్ఎం (ఆర్థో శస్త్రచికిత్స) యంత్రాన్ని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఆసుపత్రికి అవసరమైన పరికరాలను హెచ్‌డీఎస్ నిధుల నుంచి కొనుగోలు చేయాలని సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ నాగభూషణరావు, ఏఎంసీ చైర్మన్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ జగదీశ్వరి పరామర్శ

గుమ్మలక్ష్మీపురం, జూలై17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ మండ సర్పంచ్ హైమావతి కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో ఆమెను శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పరామర్శించారు. హైమావతి స్వగృహానికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలోకి చేరికలు


జనసేన కండువాలు వేసుకున్న దృశ్యం

కొమరాడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివిని వ్యవసాయ పరపతి సంఘం మాజీ చైర్మన్ పప్పల గోపాలకృష్ణ, శివిని వైసీపీ నాయకుడు అధికార శ్రీనివాసరావు, ఆర్ఎస్ రోయల్ అకాడమీ డైరెక్టర్ గొట్టాపు రేణుక, పూడేస్ పంచాయతీ నుంచి ఆరిక కస్నీగ, హిమరిక కలంబిల్లి వైసీపీ నుంచి గురువారం జనసేనలో చేరారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు తెంటు శ్రీకర్, కురపాం ఏఎంసీ వైస్ చైర్మన్ గౌరీశంకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కద్రక మల్లేశ్వరరావు కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. జనసన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పరిపాలన తీరు నచ్చి పార్టీలోకి చేరినట్టు తెలిపారు. కార్య క్రమంలో మండల జనసేన నాయకులు కిల్లన అనంత్, నాని, సంతు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ బలగాల పర్యటన

మక్కువ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మక్కువ నుంచి దుగ్గేరు గ్రామాల మధ్య స్థానిక సీఆర్‌పీఎఫ్ బెటాలిన్ కమాండ్ అసిస్టెంట్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం బలగాలు విస్తృతంగా పర్యటించాయి. దారి పొడవునా కల్వర్టులను నిశితంగా పరిశీలించారు. పూర్తిస్థాయిలో ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఎప్పటికప్పుడు తనిఖలు చేపడుతున్నారు. దారి పొడవునా వచ్చే వాహనాలను ఎరిశీలించారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతంలోకి వెళ్లే వాహన వ్యక్తులతో మాట్లాడి వివరాలు సేకరించారు.

సాలూరు మున్సిపాలిటీకి 9వ ర్యాంకు

సాలూరు, జూలై17(ఆంధ్రజ్యోతి): సాలూరు మున్సిపాలిటీకి స్వచ్ఛ సర్వేక్షన్-2025లో 9వ ర్యాంకు సాధించిందని కమిషనర్ బి.వి.ప్రసాదరావు ఓ ప్రకటనలో తెలిపారు. 20 వేల నుంచి 50 వేల జనాభా కలిగిన 49 పట్టణాలలో సాలూరు 9వ స్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావేటి బాలకృష్ణ, ప్రజారోగ్య సిబ్బందిని కమిషనర్ అభినందించారు.

శక్తియాప్‌పై అవగాహన అవసరం

పాలకొండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): శక్తి యాప్, డ్రగ్ అబ్యూజ్, సైబర్ క్రైం అంశాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించు కోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు అన్నారు. గురువారం కళాశాలలో శక్తియాప్, సైబర్ క్రైంపై ఏఎస్ఐ పి.సురేష్‌కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శక్తియాప్ ప్రతినిధి గణపతి, ఈగల్ సెల్ పోలీస్ ప్రతినిధి శ్రీనివాసరావు, ప్రకృతాంబ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం, జూలై17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర అన్నారు. గురువారం మండలంలోని బళ్లకృష్ణరాయపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దపీట వేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పంట భూములకు నీరందడం లేదని గ్రామస్థులు తెలియజేయడంలో ఆయన స్పందించారు. మరికొద్ది రోజుల్లో పూర్తిస్థాయిలో పూడికతీతలు పూర్తవుతాయన్నారు. రూ.30 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్లు వేయిస్తామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు సత్యంనాయుడు, వేణుగోపాలనాయుడు, నాయకులు శివ, మండల సీనియర్ నాయకులు శేఖర్, భానుప్రసాద్, సత్యనారాయణ, అరవింద్, శ్రీనివాసరావు, ఉమా, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలతో సమీక్ష

పార్వతీపురం రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ బూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలకు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సూచించారు. గురువారం పార్వతీపురం పార్టీ కార్యాలయంలో పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాల ఇన్‌చార్జిలతో సమీక్ష నిర్వహించారు. ప్రజల ఆకాంక్షలను తెలుసుకుని ప్రభుత్వానికి నివేదించాలని శ్రేణులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మూడు మండలాల ఇన్‌చార్జిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్లకు అభినందనలు

పార్వతీపురం రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబండపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా నియామకమైన జి.చంద్రమౌళి, బందులుప్పి చైర్మన్‌గా నియమితులైన బోను శ్రావణ్‌తో పాటు డైరెక్టర్లను గురువారం ఎమ్మెల్యే విజయచంద్ర అభినందించారు. పీఏసీఎస్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

సీఆర్‌టీలను గిరిజనులతోనే భర్తీ చేయాలి


మాట్లాడుతున్న ఏజేఏసీ అధ్యక్షుడు

సీతంపేట రూరల్, జూలై17 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖలోని సీఆర్‌టీ(కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్)పోస్టులను గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేయాలని ఏజేఏసీ అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం జీవో నెం.3, సీఆర్‌టీ పోస్టులను గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని కోరుతూ ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బి.రామ్మోహనరావు, రామస్వామి, గిరిజన యువత పాల్గొన్నారు.

అభివృద్ధిపై ఓపెన్ ఛాలెంజ్‌కు సిద్ధమా?

జియ్యమ్మవలస, జూలై17 (ఆంధ్రజ్యోతి): కురుపాం నియోజకవర్గంలో ఎవరు అభివృద్ధి చేశారో ఓపెన్ ఛాలెంజ్‌కు సిద్ధమా అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జదదీశ్వరికి మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి సవాల్ విసిరారు. గురువారం ఆమె చినమేరంగిలోని నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా వారు ఇచ్చిన హామీలు, వారి మేనిఫెస్టోలో ఉన్న అంశాలు ఎంతవరకు నెరవేర్చారన్నది ప్రజలు గమనిస్తున్నారన్నారు. చేసిన అభివృద్ధి గోరింత అయితే చెప్పుకునేది కొండంత అని విమర్శించారు. అలాగే తాను అక్రమంగా వందల కోట్లు సంపాదించనన్న వారిలో ఎవరైనా నా ఆస్తి వంద కోట్లు ఉందని నిరూపిస్తే రూ.90 కోట్లు వారికి ఇచ్చేస్తానన్నారు. సమావేశంలో వైసీపీ నాయకులు, ఎంపీపీలు కె.దీనమయ్య, శెట్టి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు

●కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్


సుంకిలో పర్యటిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

గరుగుబిల్లి, జూలై17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ హెచ్చరించారు. గురువారం మండలంలోని సుంకి పంచాయతీని ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యాధుల బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకే పారిశుధ్య పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పంచాయతీల పరిధిలో ప్రజలు రోగాల బారిన పడితే దీనికి సంబంధిత పంచాయతీ కార్యదర్శులే బాధ్యులన్నారు. గ్రీన్ అంబాసిడర్లు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి కేంద్రాలకు తరలించాలన్నారు. చెత్త సేకరణకు అవసరమైన సామగ్రిని ఇంటింటికి అందించాలని ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావుకు ఆదేశించారు. తాగునీటి వనరులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీవో కె.కొండలరావు, డీఎల్‌పీవో నాగభూషణరావు, ఎంపీడీవో పి.పైడితల్లి, తహసీల్దార్ పి.బాల, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జి.గౌరీశంకర్, ఏపీఎం పి.అప్పలనాయుడు, సర్పంచ్ కె.రవీంద్ర, ఎంపీటీసీ సభ్యులు వై.జయమ్మ, శ్రీనివాసరావు ఉన్నారు

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

గరుగుబిల్లి, జూలై17 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టులో ముంపునకు గురైన సుంకి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను కోరారు. గురువారం పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా పరిశీలనకు వచ్చిన కలెక్టర్‌కు గ్రామస్థులు తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కె.రవీంద్ర, ఎంపీటీసీ సభ్యులు జయమ్మ, శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వాకాడ కూర్మినాయుడు తదితరులు మాట్లాడారు. ప్రాజెక్టులో గ్రామం ముంపునకు గురికావడంతో తులసిరామినాయుడువలస ప్రాంతంలో పునరావాసానికి స్థలం కేటాయించారన్నారు. సుమారు 360 మంది కుటుంబాలకు పైగా స్థలాన్ని కేటాయించారని, అయితే మౌలిక వసతులు కల్పనకు దృష్టి సారించలేదని వివరించారు. రహదారులు, డ్రైనేజీలు నిర్మించారు తప్ప తాగునీరు, విద్యుత్ సౌకర్యంపై చర్యలు చేపట్టలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దానిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. విద్యుత్, తాగునీటి సౌకర్యాలను తక్షణమే ఏర్పాటు చేయాలని తహసీల్దార్ పి.బాలను ఆదేశించారు.

ప్రకృతి వ్యవసాయ జిల్లాగా గుర్తింపు పొందాలి


గోశాల స్థలాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ పారినాయుడు

గరుగుబిల్లి, జూలై17 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా ప్రకృతి వ్యవసాయ జిల్లాగా గుర్తింపు పొందేందుకు దృష్టి సారించాలని రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ డి.పారినాయుడు సూచించారు. గురువారం తోటపల్లి జట్టు కార్యాలయంలో ఉత్తరాంధ్ర రీజనల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రకృతి విధానాలు అమలుకు అనుకూలంగా ఉందన్నారు. నీతి అయోగ్ రాష్ట్రంలోని పార్వతీపురం మన్యం జిల్లాకు ప్రత్యేక గుర్తింపునిచ్చిందన్నారు. 15 మండలాల పరిధిలో శత శాతం ప్రకృతి వ్యవసాయం అమలుకు ఉమ్మడి భాగస్వామ్యంతో కృషి చేయాలన్నారు. అనంతరం రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్, జిల్లా ప్రాజెక్టు అధికారి శ్రావణ్‌నాయర్ మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ కన్సల్టెంట్ టి.శివాజీ, రైతు సాధికార సంస్థ ప్రాజెక్టు మేనేజర్ మనోహర్, ఎన్‌టీఏలు భానుమూర్తి, ఝాన్సీరాణి, ఎం.దేవిక, తదితరులు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోండి


సూచనలు చేస్తున్న డీఎస్పీ రాంబాబు

భామిని, జూలై17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎటువంటి చెడు వ్యసనాలకు పాల్పడకుండా తమ బంగారు భవిష్యత్తును తామే ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు సూచించారు. గురువారం ఏపీ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు నిషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు కూడా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన ఉండాలన్నారు. డ్రగ్స్ వల్ల యువత జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో బత్తిలి ఎస్ఐ అప్పారావు, ప్రిన్సిపాల్ బాబూరావు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన

పాలకొండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ గురువారం శంకుస్థాపన చేశారు. పట్టణంలోని గారమ్మ కాలనీ సమీపంలో భవన నిర్మాణానికి రూ.13.4 లక్షల అంచనా వ్యయంతో నూతన భవనల నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు పల్లా కొండలరావు, జిల్లా అగ్నిమాపక అధికారి టంగ సింహాచలం, పూర్వపు జిల్లా అగ్నిమాపక అధికారి కె.శ్రీనుబాబు, ఎంపీపీ బొమ్మాళి భాను, కూటమి నాయకులు ఆకుల కుమార్, ఆనెపు రామకృష్ణ, కర్నేన అప్పలనాయుడు, గంటా సంతోష్, జాడ శ్రీధర్, వాకమూడి అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

'శంబర' ఆలయ ఈవోగా శ్రీనివాసరావు

మక్కువ రూరల్, జూలై17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఇలవేల్పుగా పేరుగాంచిన శంబర పోలమాంబ ఆలయం ఈవోగా బి.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. చీపరుపల్లిలోని కనకమహాలక్ష్మీ దేవస్థానంలో కార్యనిర్వాహణాధికారిగా పనిచేస్తూ ఇక్కడకు పదోన్నతిపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఒప్పంద అధ్యాపకుల రెన్యువల్‌కు అవకాశం

సాలూరు, జూలై17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న అధ్యాపకులను రెన్యువల్ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా ఐడీ కళాశాల సాలూరు ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. జోన్-1 పరిధిలో 2024-25 విద్యా సంవత్సరంలో 30 ఏప్రిల్ 2025 నాటికి ఒప్పంద అధ్యాపకులుగా పనిచేసినవారు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఈ నెల 19 సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత కళాశాలల్లో సమర్పించాలన్నారు. వాటిని సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ ఈ నెల 20న ఐడీ కళాశాల ప్రిన్సిపాల్‌కు సమర్పించాల్సి ఉంటుందన్నారు. జిల్లా సెలక్షన్ కమిటీ సమక్షంలో ఈ నెల 21 నుంచి 23 వరకు రెన్యువల్ చేస్తామని పేర్కొన్నారు.

యూరియా పంపిణీ

వీరఘట్టం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరఘట్టం సేవాకేంద్రంలో గురువారం పోలీసుల సహకారంతో యూరియా పంపిణీ చేశారు. యూరియా పంపిణీ చేస్తున్నారన్న విషయం తెలియడంతో రైతులు ఒకేసారి అక్కడకు పెద్దఎత్తున రైతులు చేరారు. దీనితో పోలీసులు సహకారంతో యూరియా రైతులకు పంపిణీ చేశారు. మండలంలో ఇంతవరకు 384 మెట్రిక్ టన్నులు డీఏపీ పంపిణీ చేశామని ఏవో సౌజన్య తెలిపారు. మరో 15 రోజుల్లో 200 మెట్రిక్ టన్నులు యూరియా, 260 మెట్రిక్ టన్నుల డీఏపీ మండలానికి వస్తుందన్నారు. రైతులందరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా అందిస్తామన్నారు.





